

# ఊసులాడే ఒక జాబిలటా!

## నిషిగంధ



**_యదార్థ సంఘటనలకి నవలా రూపం - ఆసాంతం ఆకట్టుకునే సుమధుర స్నేహ బంధం_**

(క్రిందటిసంచిక తరువాయి)

నవంబర్ 15, 1985

హైదరాబాదు

డియర్ కార్తీకా,

*సాయంసంధ్యలో మలయానిలం*
*చల్లగా తనువును స్పృశించినప్పుడు,*
*వెన్నెల వెలుగుల్లో మధురమైన*
*సెలయేటి నీటి పాట చెవి సోకినపుడు,*
*అర్థరాత్రి ఒంటరి మెలకువలో*
*కరిగిపోని కల కళ్ళముందు కదలాడినపుడు*
*గుర్తొచ్చే నీ రూపం*
*ఎప్పటికీ నాకపురూపం!!*

నువ్వూ, నీతోబాటు మీ ఊళ్ళోవాళ్ళు, స్కూల్లో వాళ్ళూ అంతా క్షేమమే కదా! చూడగానే కళ్ళకే కాదు మనసుకి కూడా ఆహ్లాదాన్ని కలిగించేదే అసలైన అందం అని ఊరికే చెప్పలేదనిపిస్తుంది, నీ ఫోటో చూశాక! కళ్ళలో నిర్మలత్వం, ఆత్మస్థైర్యం ఒకదానితో ఒకటి పోటీ పడుతుంటే, బయటికి చిందనా వద్దా అనుకుంటున్న దరహాసం.. నా కలం ఒక్క క్షణం కూడా తడబడలేదు పై కవిత రాయడానికి.. ఫోటో పంపించావని చెప్పగానే రాధిక అయితే పిల్లలకి స్నానం చేయిస్తున్నదల్లా పరిగెత్తుకుని వచ్చింది.. ఆ తడి చేతుల్తోనే ఫోటో పట్టుకుని చూస్తానంటుంది!! తుడుచుకోమంటే వినదే!! నేను ఊరుకుంటానా.. ఇవ్వకుండా ఇల్లంతా పరుగులు పెట్టించాను.. పిల్లలు కూడా బాత్‌రూంలోంచి అలానే వచ్చేసి ఈ అల్లరికి ఇంకాస్త రంగు కలిపారు.. వాళ్ళు పార్టీలు ఇట్టే మార్చేస్తుంటారు తెలుసా! ఎప్పుడన్నా బయటకి వెళ్దామని అనుకున్నప్పుడు అన్నీ నేను చెప్పినట్టే చేస్తూ అనుక్షణం నా వెనకే ఉంటారా, అలాంటిది ఇప్పుడు రాధిక పార్టీలోకి దూకేసి నన్ను పట్టుకోవడానికి వాళ్ళిద్దరు కూడా చిన్న చిన్న చేతులు అడ్డు పెడుతూ యధాశక్తి ప్రయత్నించారు!

చివరికి ఫోటో చేజిక్కించుకుని, నిన్ను చూసి రాధిక "చూశారా, అచ్చు నే చెప్పినట్టే ఉంది" అని తృప్తిగా తలాడించేసి వెళ్ళబోతుంటే కొంగు పట్టుకుని ఆపి "అలా కాదమ్మా, కార్తీక అంది కదా నువ్వు చెప్పిన పోలికల్లో ఒక్కటి తప్ప అన్నీ కరెక్ట్ అని!" గుర్తుచేశాను.. "నిజమేనండీ" అని ఆ ఫోటో వంక ఒక పది నిమిషాలు చూసి "కళ్ళు" అని ఏదో పెద్ద పజిల్ సాల్వ్ చేసినదానిలా కాస్త గట్టిగా అరిచింది.. "అవును కాళ్ళు పెద్దవి, నువ్వు చెప్పినట్లు చిన్నవి కాదు" అంటే "అవును చక్కగా ఉంది అమ్మాయి" అని అమ్మమ్మలు మురుసుకున్నట్లు మురుసుకుని పనిలో పడింది.. మొత్తానికి నీ ఫోటో ఇల్లంతా సందడి నింపేసింది!

ఇంతకీ మీ స్నేహితురాళ్ళిద్దరూ ఇదివరకులా మామూలుగా చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారా లేదా!? అయినా చెట్టాపట్టాలేసుకుని తిరగక పోవడమే మంచిదనిపిస్తుంది.. కంగారుపడకు, నేను చెప్పేది మీ ఇద్దరి గురించి కాదు నా ఫ్రెండ్స్ గురించి.. మొన్న కలిసినప్పుడు ఒక అరగంట క్లాస్ తీసుకున్నారు, "ఉద్యోగం చేస్తున్నావు బానేఉంది కానీ ఇంకా పైకెళ్ళడానికి ప్రయత్నాలేమీ చేయడంలేదెందుకు?" అని ఒకటే నస.. పాపం వాళ్ళని అనుకోవడం ఎందుకుగానీ నేనే ఏదో ఒక కుర్చీలో సెటిల్ అయ్యాను కదా అని ఇక కెరీర్ గ్రోత్ గురించి ఆలోచించడమే మానేశాను.. అసలే టెక్నాలజీ యుగం! ఎప్పటికప్పుడు మనల్ని మనం ఇంప్రూవ్ చేసుకోకపోతే ఇట్టే వెనకబడిపోతాం.

ఒక్కోసారి అనిపిస్తుంది కనీసం రాధిక నా వెంటపడి అది కావాలి, ఇది కావాలి అని నస పెడితే అయినా ఎక్కువ డబ్బుల కోసం కెరీర్ మీదే ధ్యాసంతా పెట్టేవాడినేమో! అంతా తన తప్పే!! ఇదే మాట మొన్న తనతో అంటే దగ్గరకు రమ్మని పిలిచి మరీ బుగ్గలు పిండి మళ్ళీ సన్నజాజులు కట్టుకోవడంలో మునిగిపోయింది!! ఒకటి మాత్రం నిజం కార్తీకా, అన్నీ తెలిసిన భార్య కంటే అర్ధం చేసుకునే భార్య దొరకడం అసలైన అదృష్టం!! లేకపోతే కవితలూ, కథలూ వద్దని ఎప్పుడో నా పెన్ను ని విరిచి పారేసి ఉండేది.. స్వత హాగా తనకి సాహిత్యం, పుస్తకాలు ఇలాంటివాటి మీద అభిరుచి లేకపోయినా నా ఇష్టాల్నే తన ఇష్టంగా చేసుకుంది.. ఇప్పుడంటే పిల్లలు చిన్నవాళ్ళు అంతా బానే జరిగిపోతున్నాయి.. భవిష్యత్తు కోసమైనా కసరత్తు మొదలుపెట్టక తప్పదు.. అయినా ఒక విధంగా చెప్పాలంటే ఈ విషయంలో నువ్వుకూడా ఒక ప్రోత్సాహకారివే!! ఇంట్లోవాళ్ళ మద్దతు లేకపోయినా ఇంకా పెద్ద చదువులు చదవాలనే నీ సంకల్పం తల్చుకుంటే కొత్త ఉత్సాహం వస్తుంది..

అదమ్మాయ్ ఈసారికి కబుర్లు.. నాలు తెల్సు మా ఫోటో సంగతేం చెప్పకుండా ముగించేస్తున్నానని అనుకుంటున్నావు కదూ.. నీకు పంపడానికి అట్లాంటి ఇట్లాంటి ఫోటో సరిపోదు అందరం మళ్ళీ కొత్తగా తీయించుకుందామని రాధిక ఆర్డర్ వేసింది.. సో, అదీ సంగతి.. ఉంటాను మరి

**వంశీ**

*** *** *** ***

**నవంబర్ 25, 1985**

**మాజేరు**

**ప్రియ నేస్తానికి,**

బావున్నారు కదూ.. చలికి గువ్వలు, చెట్లే కాదు గాలి కూడా ముడుచుకు పడుకున్నట్టుంది.. ఎక్కడా ఒక ఆకు కదిలిన శబ్దం కూడా రావటంలేదు.. చలికి, నిద్రకి మంచి దోస్తీ ఏమో కదా! చీకటి ముసురుకుంటూనే నిద్ర వాకిట్లో తారట్లాడుతుంది.. తెల్లారాక దుప్పట్లోంచి కాళ్ళు బయటకి తీయాలంటే మొత్తం శరీరం ససేమిరా అంటుంది.. అదేంటో కానీ చలికాలంలో పగటిపూటంతా కాస్త ఎక్కువ

ఉల్లాసంగా ఉంటుంది.. కానీ పాపం మంచు దేశాల్లో ఉండేవాళ్ళ అవస్తలు తలచుకుంటే జాలేస్తుంది.. బయటకి అడుగు పెట్టాలంటే కేజీలకి కేజీలు బరువుండే కోట్లు వేసుకోవాలంట! మీ ఊళ్ళో చలి భూతంలా ఉంటుందా లేక మాకు లాగా అల్లరి నాయికలా కవ్విస్తుంటుందా?

నాకు స్కూల్లో బాధ్యతలు ఎక్కువయ్యాయి.. ఇష్టపడి చేస్తున్నవేలేండి! చెప్పాను కదా భూషణం సార్ వచ్చాక మా స్కూల్‌కి ఓ కొత్త వైభవమొచ్చిందని.. ఆయన చేయిస్తున్న పనులే ఇవి.. పిల్లలకి మొక్కలు పెంచడంలో ఆసక్తి కలగజేయాలని పోటీ లాంటిది పెట్టారు.. ఎవరి క్లాసు ముందు వాళ్ళు తమ సొంతంగా గార్డెన్ పెంచేట్లు చేస్తున్నారు.. అందులో ఏమేం మొక్కలు ఉండాలనేది పూర్తిగా పిల్లల నిర్ణయమే! ఏమైనా సలహాలు కావాలంటే క్లాస్ టీచర్‌ని అడగొచ్చు.. వారానికొకసారి అన్ని తోటలనీ పర్యవేక్షించే పని నాకు ఇచ్చారు.. అలాగే వారానికి రెండు పీరియడ్లు కుట్టుపని, డ్రాయింగ్, వ్యక్తిగత / పరిసరాల శుభ్రత ఇలాంటివాటికి కేటాయించారు.. చిన్న చిన్న పనులకు కూడా వాళ్ళని వాళ్ళ అమ్మానాన్నల మీద ఆధారపడకుండా చేయడమే ఈ ప్రత్యేక శిక్షణకి కారణం.. ఇదివరకు పాపం పిల్లలు చొక్కా గుండీలు ఊడిపోయినా అలానే స్కూల్ కి వచ్చేవాళ్ళు.. ఇప్పుడు చూడాలి వాళ్ళని! శుభ్రంగా ఉతికిన డ్రెస్, చక్కగా దువ్వుకున్న జుట్టు.. అబ్బా ఎంత ముచ్చటగా ముద్దొచ్చేస్తున్నారో!! ఈ స్పెషల్ క్లాస్ లన్నిటినీ చూసుకునేది సులోచన మేడం.. పిల్లలకి నేర్పించే విషయాలను, పద్ధతులనూ చూస్తుంటే ఆవిడకి తెలీని విషయమంటూ ఉందా అనిపిస్తుంది.. గులాబీ పువ్వు, కుక్కపిల్ల, పర్ణశాల ఇలాంటి చిత్రాలన్నీ పిల్లలు క్షణాల్లో నేర్చేసుకుంటున్నారు.. కాదు అంతా సునాయాసంగా ఆవిడ నేర్పిస్తున్నారు.. బొమ్మ పూర్తిచేసిన తర్వాత వాళ్ళ మొహాలు చూడాలీ.. వెయ్యి మతాబుల వెలుగు కూడా వెలవెల పోతుంది!! ఇవన్నీ చూస్తుంటే పిల్లలకి చదువుతో పాటు నేర్పించాల్సిన విషయాలెన్నో ఉన్నాయనిపిస్తుంది.

ఈ దంపతులిద్దరినీ మా ఇంటికి రమ్మని ఆహ్వానించాను.. పిలవగానే ఒక్కసారి మాత్రం "ఇవన్నీ ఎందుకులేమ్మా.. రోజూ స్కూల్లో కలుస్తూనే ఉన్నాం కదా" అన్నారు.. నేను ఇంకోసారి అడగగానే ఇంకేమీ బతిమాలించుకోకుండా వస్తామని చెప్పారు.. అదీ మరుసటిరోజే! స్కూల్ అవ్వగానే నేరుగా వచ్చారు.. ఆరోజు పొద్దున్నే నేను అమ్మమ్మ తో చెప్పి వచ్చాను వాళ్ళని తీసుకొస్తున్నట్లు.. అయినాగానీ నాకు వాళ్ళని తీసుకుని వెళ్తుంటే ఇల్లు దగ్గరపడుతున్నకొద్దీ ఒకటే టెన్షన్ ఎక్కడ అమ్మమ్మ పాలేర్ల మీద ఎగిరిపడుతూ కాళికావతారంలో దర్శనమిస్తుందోనని!! కానీ అలాంటి భయాలేమీ నిజమవ్వలేదు.. తాతయ్య కూడా చక్కగా ఇంటిపట్టునే ఉండి మాకోసం ఎదురుచూస్తున్నాడు.. సార్ వాళ్ళు ఒక గంట కూర్చుని వెళ్ళిపోయారు.. కానీ ఉన్న కాసేపట్లోనే వాళ్ళకి మా అమ్మమ్మ గద్దరితనం, తాతయ్య లౌక్యం బాగా అర్థమై ఉంటుంది.. లేకపోతే ఆ కాస్త సమయంలో అమ్మమ్మ ఎన్ని ఆరాలు అడిగిందనీ!! నాకెందుకో ఆ రాత్రి అంతా అదోరకమైన సంతోషం, సాక్షాత్తూ పార్వతీ పరమేశ్వరులే మా ఇంటికొచ్చివెళ్ళినట్లు!

మీకో సంగతి చెప్పాలి.. పోయిన శనివారం సాయంత్రం ఆఖరి రెండు పీరియడ్ల టైమ్ లో పిల్లల కోసం ఒక చిన్న ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు స్కూల్లో చెప్పారు.. అది ఏ రకమైన ప్రదర్సనో అని అందరికీ ఉత్సుకతే! రెండింటినించీ అంతా ఒకటే కోలాహలం.. చిన్న వేదికని అరేంజ్ చేయడం, పిల్లల్ని వరుసల్లో కూర్చోబెట్టడం ఒకలాంటి పండగ వాతావరణం.. మామూలుగా అయితే ఇలా సభలు జరుగుతుంటే అది ఏ సందర్భంగా చేస్తున్నదీ అందరికీ ముందే తెలుస్తుంది.. కానీ ఇప్పుడు అలా కాదు కదా! అలా ఇలా చూస్తుండగానే మూడైంది.. కానీ ఆ ప్రదర్శన నిర్వహించాల్సిన వ్యక్తి ఇంకా రాలేదు.. ఓ పక్కన పిల్లల్ని కంట్రోల్ చేయలేకపోతున్నాము.. సులోచన మేడం ఎవరికో ఫోన్లు చేస్తూ ఆఫీసు రూంలోకీ బయటికీ హడావిడిగా తిరుగుతున్నారు.. నేనే ఇంక బాగా పాడే పిల్లల్ని తీసుకెళ్ళి పాటలు

పాడించడం మొదలుపెట్టాను.. కాస్త సద్దు మణిగినట్లనిపించింది.. పది నిమిషాలు గడిచాయో లేదో చిన్న కలకలం.. ఒకతను ఓ మూడు బ్యాగ్‌లు మోసుకుంటూ ఇంచుమించు పరుగు పెడుతున్నట్లే స్టేజ్ వైపుకి  వస్తున్నాడు.. అతను స్టేజ్‌ని సమీపించగానే గుర్తుపట్టేశాను, ఇంకెవరూ ఫోటోలబ్బాయ్ వికాస్!! వెంటనే అనుకున్నాను "దేవుడా ఈ మహానుభావుడు ఇప్పుడందరికీ ఫోటోలు ఎంత బాగా తీయాలో నేర్పించడు కదా!" అని.. వస్తూనే గబగబా రెండు టేబుళ్ళు వేయించాడు అదీ నాతోనే! అవి వేసేసి మెల్లగా స్టేజ్ దిగి వెళ్ళి పోతుంటే, "మేడం, మీరు ఇక్కడే ఉండాలండి.. నాకు ఒకరి సహాయం కావాలి ఇక్కడ" అని ఆపేశాడు.. అంతే కోపం తన్నుకొచ్చింది.. 'ఇతనికి నేను తప్ప ఎవరూ కనబడరా' పళ్ళు కొరుక్కుంటూ అక్కడే నిలబడ్డాను..

ఆ సంచుల్లోంచి ఏవో రంగు కాగితాలు, టోపీ, ప్లాస్టిక్ పూల గుత్తులు లాంటివి తీసి బయట పెట్టి పిల్లలతో మాట్లాడటం మొదలుపెట్టాడు.. రెండు నిమిషాల్లో అర్థం అయింది అతను మ్యాజిక్ షో చేయబోతున్నాడని.. లోపల కోపం లావాలా పొంగుతున్నా 'అబ్బో ఇతనికి చాలా కళలే తెలుసే!' అనుకున్నా.. అతనికి కావాల్సినవన్నీ అందిస్తూ చూస్తుండగానే నేనూ పిల్లల కంటే ఎక్కువగా ఆ ప్రదర్శనని ఎంజాయ్ చేయసాగాను.. పిల్లలైతే ఒకటే అరుపులు, చప్పట్లూను!! మొత్తానికి చాలా బాగా జరిగింది అనుకుంటూ అతను తెచ్చిన వస్తువులన్నీ మళ్ళీ లోపల పెట్టేస్తుంటే చూశాను అతని షర్ట్ వెనక ఉన్న రక్తపు మరకల్ని!! కాస్త భయం వేసింది, ఏదైనా యాక్సిడెంట్ లాంటిది జరిగి దెబ్బలేమైనా తగిలాయేమో అని!! మెల్లగా అక్కడ నించి జారుకుని ఆ విషయం సులోచన మేడంకి చెప్పాను.. ఆవిడ "అవునా కనుక్కుంటాను" అన్నారు కానీ నాకే మనసాగక అతని దగ్గరకెళ్ళి "మీకేమన్నా ఫస్ట్ ఎయిడ్  కావాలంటే చెప్పండి" అన్నా.. అతను నావంక ఆశ్చర్యంగా చూసి "ఫస్ట్ ఎయిడా!! అవసరం లేదు." అన్నాడు.. ఇక నాకెందుకులే అని వచ్చేశాను.. కానీ ఇంటికి తిరిగి వస్తుంటే దారంతా అవే ఆలోచనలు.. అయినా అది యాక్సిడెంట్ కాదేమో.. ఎవరితో అయినా గొడవ పడితే బాగా తన్ని ఉంటారు అనుకున్నా.. అలా అనుకోగానే మనసు ఎందుకో ఎదురుతిరిగింది.. 'అలా జరిగుండదులే' అని నాకు నేనే సర్ది చెప్పుకున్నా.. విచిత్రంగా అనిపించింది.. ఆ స్టేజ్ మీద నుంచుని కారాలు మిరియాలు నూరింది నేనేనా అన్న ఆశ్చర్యం!! అంతలోనే ఈ మెత్తదనం ఏమిటో!? బహుశా పిల్లల మొహాల్లో అన్ని నవ్వులు కురిపించాడనా!? తెలీదు!

అలా ఆలోచనల్లో తేలుకుంటూ ఇంటికి వచ్చానా ఎదురుగా అమ్మమ్మ.. ఆమె మొహం చూస్తూనే మనసు ఏదో కీడు శంకించింది.. "వసంత ఆత్మహత్య చేసుకుందంటే" ఎలాంటి ఉపోద్ఘాతమూ లేకుండా చెప్పేసింది! అంతే.. ఒక్కసారి మైండ్ అంతా బ్లాంక్‌గా అయిపోయింది.. అలా కూర్చుండిపోయాను.. నానుంచి ఎలాంటి ప్రశ్నలూ రాకపోయేసరికి మళ్ళీ తనే "వాళ్ళ అత్తగారింట్లోనే ఉరిపోసుకుని చనిపోయిందంట" కాస్తాగి "అయినా బంగారంలాంటి జీవితం.. సొంత అమ్మానాన్నల్లా చూసుకునే అత్తామామలు, బోల్డంత ఆస్తి.. ఇప్పుడు ఇంకో పెళ్ళి  చేసుకోకపోతే దీనికి తక్కువైందేంటంట! కొడుకుని చూసైనా బ్రతికెయొచ్చు కదా!!" ఏంటేంటో చెప్తూనే ఉంది.. నాకు విపరీతమైన కోపం వచ్చింది, వసంత మీద!! ఆత్మహత్య చేసుకోవడమేమిటసలు.. జీవితమటే అంత చులకనా! తనకి కావాల్సింది సాధించుకోవాలి గానీ!! అంతలోనే అది పెరిగిన వాతావరణం, చదివిన చదువు గుర్తొచ్చి రెండింతల బాధ.. పాతికేళ్ళు నిండకుండానే మోడుబోయిన జీవితం.. మళ్ళీ పెళ్ళి చేసుకుంటానని ఒక ఆదర్శమూర్తి వచ్చినా ససేమిరా అంటున్న కుటుంబం!! ఆ పరిస్థితుల్లో ఉన్న ఏ అమ్మాయైనా అదే పని చేస్తుందేమో!! తన బాబుకి మాత్రం ఎలాంటి కష్టమూ తెలీకుండా పెంచుతారు తన అత్తామామలు.. అందులో ఏ సందేహంలేదు.. ఆ ధైర్యంతోనే ఇంత పని చేసిందేమో! అసలు ఆ అమ్మాయిని తన బ్రతుకు తనని బ్రతకనీయడానికి ఆ కుటుంబాలకి అంత అభ్యంతరమేమిటో!! కళ్ళలో నీళ్ళు తిరుగుతుంటే అదో రకమైన వైరాగ్యం మనసుని మెల్లగా ఆక్రమించుకుంది.

అది సరేగానీ మాస్టారూ, మీ ఉత్తరం చదువుతుంటే నా ఫోటో కోసం మీరందరూ చేసుకున్న సందడి పండగలో నేనూ మీతో కలిసి పరుగులు పెడుతున్నట్లు ఒకటే సంతోషం.. 'కాదేదీ కవితకనర్హం' లాగా మీకు 'కాదే విషయం సంబరానికనర్హం' అనుకుంటా!! కవిత అంటే గుర్తొచ్చింది "నీ రూపం" నిజంగా నా ఫోటో చూసి రాసిందేనా! అంటే మీరు అబద్ధం చెప్తున్నారని కాదు కానీ కవిత రాసేంత ఘనత ఆ ఫోటోకుందా అని!! ప్రస్తుతం నేను ములగచెట్టు చిటారు కొమ్మన ఉన్నా మరి! దిగడానికి కాస్త టైం పట్టొచ్చేమో.. అందుకే ఇప్పుడిప్పుడే మళ్ళీ పొగిడే కార్యక్రమాలు పెట్టుకోకండి.

మరి, నాకోసమే మీరు తీయించుకోబోయే స్పెషల్ ఫోటో నాకు చేరేదెన్నడో!? సరే మరి ఇక ఇక్కడితో ఆపుతాను.. అసలే పాపం ఉద్గ్రంథాలు ముందేసుకుని కష్టపడుతున్నారేమో.. అదే కెరీర్ మీద ఫోకస్ చేస్తానని అన్నారుగా! ఇంతకంటే ఎక్కువసేపు మీ సమయాన్ని అరువు తీసుకోలేను..

**కార్తీక**

*** *** *** ***

**డిసెంబర్ 10, 1985**

**హైదరాబాదు**

**హలో కార్తీకా,**

ఏమిటసలు నీ ఉద్దేశ్యం!! నేను ఉత్తరం రాసిన పది రోజులకి తిరిగ్గా రిప్లై రాశావు.. అదీ ఉత్తరం నిండా మీ భూషణం సార్ కబుర్లే!! నీ పద్ధతి నాకేం నచ్చట్లేదమ్మాయ్.. ఏదో నువ్వు చదువుతున్న పుస్తకాల గురించో లేక మీ అమ్మమ్మని కాకా పట్టడానికి వాడుతున్న కొత్త పద్ధతుల గురించో, అదీ కాకపోతే మాళ్ళీ నా రచనలని పొగుడుతూనో ఉత్తరం నింపేస్తావని ఆశగా చూశాను.. "మరీ ఇంత జెలసీనా!" అని తిట్టుకోకు.. ఏదో సరదాగా అంటున్నా.. నిజం చెప్పాలంటే మీ స్కూల్ విషయాలు వింటుంటే మీ సార్ మీద చాలా గౌరవం పెరిగిపోతుంది.. ఆయన్ని చూడాలనిపిస్తుంది కూడా!

వసంత గురించి విని మేమిద్దరమూ చాలా బాధపడ్డాము.. పెళ్ళి చేసుకుందామనుకున్న అతనికి ఎంతటి వేదనో తలుచుకుంటే ఎలానో ఉంది.. కానీ ఒక విషయం కార్తీకా, మనిషి సంఘజీవి.. చదువు ఉన్నా లేక స్వతంత్ర ఆలోచనలు ఉన్నా గానీ అన్ని పనులు మనకు కావాల్సినట్లు చేశేయలేము.. మన కుటుంబం ఎప్పుడూ చుట్టూవున్నవారు గీసిన పరిధిలోనే బ్రతకాలనుకుంటుంది.. అది దాటి వారి చేత చెడు అనిపించుకోవడం వారికిష్టం ఉండదు.. ఇంకా చెప్పాలంటే సాహసం చేయలేరు.. అందుకే వసంత తన జీవితానికి ఒక కొత్త అర్థం దొరుకుతుందని తెలిసినా అది సంఘం పరిధి బయట ఉండటంతో ఆ గీత దాటలేక, అందులో ఉండలేక తనే మాయమైపోయింది.. అసలు ఆత్మహత్య చేసుకోవడానికి ఎంత ధైర్యం కావాలో కదా! అదే ధైర్యం సమస్యని ఎదుర్కోవడంలో చూపిస్తే!! సరే ఈ విషయం గురించే ఆలోచిస్తూ మనసు పాడుచేసుకోకు.. నీముందు నీ కోసం ఎదురుచూస్తున్న కర్తవ్యాలు ఉన్నాయి..

నేను వర్క్ లో ఒక ప్రోజెక్ట్ హేండిల్ చేస్తున్నాను, మొదటి నించి చివరిదాకా! నేనే అంతా డిజైన్ చేశాను చేస్తున్నాను.. సో, నువ్వన్నట్లే నా ముందూ, పక్కనా మాన్యువల్సే! ఇప్పుడు ఈ ఉత్తరం కూడా డిన్నర్ టైంని త్యాగం చేసి రాస్తున్నా.. అంటే నేను తినడం మానేశానని నువ్వు బాధపడకు.. రాధిక ఇవాళ రాత్రికి రవ్వ దోశెల ప్రోగ్రాం పెట్టింది.. తను తినిపిస్తుంటే నేను గబగబా రాస్తున్నా.. అయినా తన

జడలోని సంపెంగల సువాసన దోసెల ఘుమఘుమలతో చెట్టాపట్టాలేసుకుని నా చుట్టూనే తిరుగుతుంటే "అబ్బా, ఈ డిజైన్లు, మాన్యువల్స్ ఎందుకు గానీ చక్కగా నోట్ పాడ్ పట్టుకుని ఏదన్నా రాసుకుందాం" అన్న దురాలోచన వస్తుంది.. అమ్మో, ఈ మేడం గారు ఊరుకోరు.. చూడటానికి ఆహ్లాదంగా నవ్వుతూ కనిపిస్తుందా ఏదైనా పని చేయాల్సివచ్చినప్పుడు మాత్రం చండశాసనురాలే!! అందుకే ముందే చెప్పా ఈ ప్రోజెక్ట్ అయ్యేంతవరకూ నేను రాతలు కోతలు అని ట్రాక్ తప్పకుండా చూడమని.. ఏదో నీకు మాత్రం రాయడానికి దయతలిచింది.

సరే మరి ఇక ముగించి ఒక్క దోశన్నా నా చేత్తో తింటాను.. మన వేళ్ళతో కొబ్బరి పచ్చడి తిన్న ఆనందమే వేరు కదా!!
ఉంటాను.
**వంశీ**

*** *** *** ***

**డిసెంబర్ 22, 1985**
**మాజేరు**

**కుశలమేనా కవిగారూ!**
మీ ఉత్తరమంతా రవ్వ దోశెల వాసనే!! ఆ స్ఫూర్తితోనే నేను కూడా ఇవాళ రవ్వ దోశెలే చేశాను మా ఇంట్లో టిఫిన్‌కి.. చిన్నగా తరిగిన కొబ్బరి ముక్కలు, కొత్తిమీర, పోపు వేసిన జీలకర్ర, ఆవాలు అన్నీ కలిపి దోశెలు వేస్తుంటే తాతయ్య అయితే వంట గదిలోంచి కదలకుండా ఒకటి తర్వాత ఒకటి ఎనిమిది దోశెలు తిన్నాడు!! అమ్మమ్మ తినలేదు లేండి.. తనకి నామీద పీకల వరకూ కోపంగా ఉంది మరి!! ఏమిటో, నా తెల్లవారుఝామున చన్నీటి స్నానాలు, మారుమాట్లాడకుండా గుడికి వెళ్ళడాలు ఇవేవీ పని చేసేటట్లు లేవు..

మొన్న శుక్రవారం కాక అంతకు ముందు శుక్రవారం హాఫ్ యియర్లీ ప్రిపరేషన్‌కని సెలవు ఇచ్చారు.. తాతయ్యకి కాస్త అకౌంట్లు చూడటం, జీతగాళ్ళకి, పని వాళ్ళకి ఇవ్వాల్సిన నెల జీతాలు లెక్కబెట్టి వేరుగా పెట్టడం ఇలాంటి పనులతోనే ఉదయమంతా కరిగిపోయింది.. మీకెప్పుడూ చెప్పలేదేమో మా ఇంట్లో ఇలా లెక్కలూ ఎక్కాలూ చూశేది నేనే! ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు రేట్లు, ఎరువుల రేట్లు ఇలాంటివన్నీ నీట్‌గా రాసి ఉంచుతాను.. అవి చూసే తాతయ్య ఈ సంవత్సరానికీ, పోయిన సంవత్సరానికి ఉన్న తేడాలు బేరీజు వేసుకుంటాడు.. నాకున్న ఇంకో చిన్న సరదా పొద్దున్నే రేడియోలో వచ్చే 'పొలం పనులు' కార్యక్రమం వింటూ ఆరోజు చెప్పిన ముఖ్యమైన సలహాలు రాస్తాను.. అది "పొలం పనులు" డైరీ అన్నమాట.. మా తాతయ్యకి అదో పెద్ద కాలక్షేపం.. ఒక్కోసారి రాత్రి అన్నాలయ్యాక కాసేపు ఆ పుస్తకం చదవమంటాడు..

సరే ఇంతకీ ఎక్కడ ఉన్నాను? ఆ.. ఆ లెక్కలన్నీ చూశేసి భోజనం చేసి, ఎప్పటినించో రెండవసారి చదువుదాం అని వాయిదా వేస్తున్న 'కన్యాశుల్కం' తీశాను.. రెండు పేజీలు చదివానో లేదో బయట నించి అమ్మమ్మ గొంతు, "అమ్మలూ పోస్ట్ లో నీకేదో పుస్తకం వచ్చిందే" గట్టిగా వినిపించింది.. "నాకా! పుస్తకమా!?" అనుకుంటూ వెళ్ళి తీసుకున్నా.. తీరా చూస్తే అది ఎమ్.ఫిల్ అప్లికేషన్ ఫామ్స్, బ్రోచర్.. ఎలాగూ అదేంటని తెలిసే వరకూ ఊరుకోదని అమ్మమ్మతో నేను ఇంకా చదవాలనుకున్న విషయం చెప్పేశాను.. ఇక చూడండీ అప్పటివరకూ కాకుల కావ్ కావ్ తప్ప ఇంకేమీ వినబడని ప్రశాంత వాతావరణం అమ్మమ్మ అరుపులతో చెల్లాచెదురైపోయింది.. తను అన్నవన్నీ రాసి మీ టైమ్ వేస్ట్ చేయను కానీ సారాంశం మాత్రం అక్కడికీ ఇక్కడికీ వెళ్ళి చదవడానికి వీల్లేదనీ, ఇక ఆలశ్యం చేస్తే లాభం

లేదు మంచిరోజు చూసి సంబంధం ఖాయం చేస్తున్నట్లు చింతలపూడి వాళ్ళకి కబురు పంపిస్తానని.. అప్పటివరకూ మెల్లగా తనకి నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్న నాకు పెళ్ళి మాట వినగానే విపరీతమైన కోపం వచ్చి ఛరున లేచి బట్టలు మార్చుకుని "ఎక్కడికెళ్తున్నావే" అని గదమాయిస్తున్న అమ్మమ్మ మాటల్ని లెక్కచేయకుండా గబగబా ఇంట్లోంచి బయటకి వచ్చేశాను.. బయటకైతే వచ్చాను కానీ ఎక్కడికెళ్ళాలో తెలీలేదు.. ఎందుకో మాధురి దగ్గరికి వెళ్ళబుద్ధి కాలేదు.. అది చెప్పే రాజారావు కబుర్లు వినే స్థితిలో నా మనసు లేదు.. హ్యాండ్ బ్యాగ్ కూడా చేతిలో ఉందేమో అప్రయత్నంగా నా కాళ్ళు బస్ స్టాప్ వైపుకి దారి తీసాయి.. అరగంటలో సులోచన మేడం వాళ్ళ ఇంటిముందు ఉన్నాను!!

బొంగు కర్రలతో చేసిన ప్రహరీ గేటు తీస్తుంటే అనిపించింది "ఇదేంటీ ఆవేశంలో ఇలా వచ్చేశాను.. పైగా సెలవు రోజు కూడా వాళ్ళు ఏమైనా పనిలో ఉంటారేమో" అనుకుంటూ ఇంటి వసారాని సమీపిస్తుంటే అప్పుడే ఉడికినట్లున్న పలావు వాసన ఒక్కసారే చుట్టుముట్టింది! అంతక్రితమే సుష్టుగా భోజనం చేశినా ఆ వాసనకి మళ్ళీ ఆకలేస్తున్న ఫీలింగ్!! వసారాలో తల దూర్చేసి మరీ దీర్ఘంగా పేపర్ చదువుకుంటాయన్ని చూసి "సార్" అని పిలిచాను.. పేపర్ లో నించి తల సగం పైగా బయటకి వచ్చింది.. "ఏంటీ మహానుభావుడు ఇక్కడ ఉన్నాడు??" అనుకుంటుంటే "సార్ లోపల ఉన్నారు" అని చెప్పి మళ్ళీ తల పేపర్లోకి వెళ్ళిపోయింది.. అసలే కోపంతో ఉన్నానేమో అతని ప్రవర్తన ఇంకా చిరాకు తెప్పించింది.. "రెండు సార్లు హెల్ప్ అని స్కూల్లో నాతో చచ్చేంత పని చేయించుకున్నాడు.. ఇప్పుడేమో అసలు నేనెవరో ఎరగనట్లు ఫోజు కొడుతున్నాడు!" ఆ చిరాకుతోనే ఈసారి "మేడం" అని కాస్త గట్టిగా అరిచాను.

లోపల్నించి మెడలో తువ్వాలు, చేతిలో గరిటె తో భూషణం గారు బయటకి వచ్చారు.. నన్ను చూడగానే ఆయన మొహంలో ఆనందంతో కూడిన ఆశ్చర్యం! వెంటనే "లోచనా.. లోచనా.. ఎవరొచ్చారో చూడు" అంటూనే పక్కకి తిరిగి "వికాస్, గుర్తుపట్టలేదా కార్తీక.. మన స్కూల్లో చేస్తుంది కదా" అంటే అప్పటికి అతగాడికి చలనం వచ్చినట్లు లేచి "నమస్తే అండి" అన్నాడు.. నేను అతన్ని పట్టించుకోకుండా "టీచింగ్ నోట్స్ స్కూల్లోనే మర్చిపోయానండి.. అలా వెళ్తూ మిమ్మల్ని పలకరిద్దామని వచ్చాను" అంత పెద్ద అబద్ధం ఎంత సునాయాసంగా వచ్చేసిందో నా నోటివెంట! అంతలో పక్కనించి స్టూల్ ఒకటి మోసుకుంటూ మేడం వచ్చారు.. ఆవిడా నన్ను చూడగానే సంతోషించారు.. "వారంపైనే అయింది సందులో బల్బులు మాడిపోయి.. ఇవాళ్టికి కుదిరింది మార్చడానికి" అని "పదమ్మా లోపలికి వెళ్దాం" అని చెయ్యి పట్టుకు తీసుకెళ్ళారు.. నాకు లోపలికి వెళ్తుంటే కొంచెం విచిత్రంగా అనిపించింది.. సార్ చక్కగా కమ్మని పలావ్ వండుతుంటే, మేడం చక చకా బల్బులు మార్చేస్తున్నారు!! కాస్త ఇంట్రెస్టింగానూ అనిపించింది..

నన్ను కూడా భోజనానికి రమ్మంటే నేను తినేసి వచ్చానని వాళ్ళని చేసేసి రమ్మని చెప్పాను.. వికాస్ తమాషాగా నవ్వుతూ "అయ్యో మీరు రాకపోతే మామయ్య మా ఇద్దరికీ కూడా అన్నం పెట్టరు" అన్నాడు.. చేసేది లేక నేనూ వాళ్ళతో కుర్చున్నాను.. అన్నం తింటుంటే మధ్యలో మేడం "వికాస్ ఆరోజు నీ షర్ట్ మీద రక్తపు మరకలు చూసి యాక్సిడెంట్ అయ్యి దెబ్బలు తగిలాయేమోనని కంగారుపడింది కార్తికే!" అని చెప్పారు.. నాకెందుకో ఆవిడ అతనిముందే అలా చెప్పేస్తుంటే కొంచెం ఇబ్బందిగా అనిపించింది.. సార్ మాత్రం భళ్ళున నవ్వేసి "యాక్సిడెంటా పాడా.. వీడు విద్యార్థి సంఘం నాయకుడు.. ఆరోజున చల్లపల్లిలో రాస్తారోకో చేస్తుంటే పోలీసులతో జరిగిన గొడవ ఫలితంగా తిన్న లాఠీ దెబ్బలవి!" అన్నారు.. నాకైతే చెప్పలేని ఆశ్చర్యం!! అంత గొడవ జరిగీ, దెబ్బలు తినీ ఏమీ జరగనట్లు స్కూల్ కొచ్చి ఆ మ్యాజిక్ ప్రదర్శన ఇచ్చాడా!! ఆరోజు ఆదరాబదరాగా బ్యాగులు మోసుకుంటూ వస్తుంటే లేట్ చేసినందుకు నేనతన్ని ఎంత

తిట్టుకున్నానో గుర్తొచ్చి బాధేసింది.. నా ఆలోచనల్లో ఉండగానే భూషణం గారే మళ్ళీ "వీడికి పిల్లలంటే ప్రేమో లేక మేమంటే అభిమానమో తెలీదు కానీ స్కూల్ కోసం ఏదడిగినా కాదనకుండా చేస్తాడు" అన్నారు.. అయితే ఫోటోలు కూడా అలా తీసినవేనా! ఇతనికేదో ఫోటో స్టూడియో ఉందనీ, మా స్కూల్లో అన్ని ఫోటోలు తీసి బోల్డంత సంపాదించేసి ఉంటాడని అనుకున్న నా ఊహ కూడా నిజం కాదు! మనసులో అతని మీద పేరుకున్న దురభిప్రాయాలన్నీ నెమ్మదిగా మాయమవడం నాకు తెలుస్తూనే ఉంది! 'ఇందాక సార్‌ని "మామయ్యా" అని పిలిచాడు అంటే వీళ్ళు బంధువులా!?' ప్రశ్న ఉదయించింది కానీ అడిగే ధైర్యం మాత్రం చేయలేదు..

అసలు నేనే కారణం చేత అక్కడికి వెళ్ళానో అవన్నీ మర్చిపోయి హాయిగా రెండుగంటల పాటు కబుర్లు చెప్పుకుని, టీ తాగి ఇంటికి బయలుదేరాను.. వచ్చేస్తుంటే మేడం జాకెట్ పీస్, పూలు, పళ్ళు పెట్టారు.. నేను 'ఇవన్నీ ఇప్పుడెందుకండీ" అంటుంటే "నా కూతురి లాంటిదానివి.. అమ్మ ఇచ్చిందని తీసుకో" అంటుంటే నాకు కన్నీళ్ళు ఆగలేదు.. అమ్మ పోయిన తర్వాత 'నేనే మీ అమ్మననుకో' అని దగ్గరకు తీసుకుందెవరూ లేదు.. ఆవిడలా అనగానే పొదివి పట్టుకుని ఏడ్చేశాను!! కానీ వంశీ గారూ, ఆ రోజు ఇంటికి తిరిగి వస్తుంటే మనసుని ఆవరించిన ప్రశాంతతని వర్ణించడానికి మాటలు రావడంలేదు.. ఆక్షణంలో ఎంతటి సమస్యైనా చిన్నదిగానే అనిపించింది.. అందుకే ఇంటికి రాగానే అమ్మమ్మ మళ్ళీ కోపంతో అరుస్తున్నా నేను పట్టించుకోలేదు.. ఎక్కడికెళ్ళానో చెప్పాను.. ఇంకా వంట చేయకపోవడం చూసి నేనే గబగబా ఒక కూరా అన్నం వండాను.. మామూలుగా అమ్మమ్మ అలా నామీద అరిస్తే నేనూ గట్టిగా ఏవేవో మాటలనేసి వెళ్ళి పడుకుండిపోయేదాన్ని.. అలాంటిది నేను మాములుగా ఉండటం చూసి తనే ఇంక కామ్‌గా అయిపోయింది..

కానీ ఇంకా నాతో మాట్లాడటం లేదు.. చూడాలి ఎన్నిరోజులు పడుతుందో తను మామూలుగా అవడానికి.. ప్రస్తుతానికైతే ఆ చింతకాయలో దోసకాయలో వాళ్లెవరికో సంబంధం గురించి కబురు పెడతానన్న పని మాత్రం చేయలేదు.. తను ఆ ఊసు ఎత్తనంతవరకూ నా మీద ఎంత కోపంగా ఉన్నా పర్వాలేదు.. నేను మాత్రం అప్లికేషన్ పూర్తి చేసి పంపేశాను.. ఇక నేను ఆ తయారీలో ఉండాలి.. వీలు చూసుకుని సులోచన మేడంతో నా పరిస్థితి గురించి మాట్లాడాలి..

అబ్బా, చూస్తూ చూస్తూనే మళ్ళీ ఎంత పెద్ద ఉత్తరం రాసేశాను!! ఏంటో మీతో కబుర్లు మొదలుపెడితే మా సుబ్బులు తుమ్మిన సంగతి దగ్గరనించీ మాఊరి బస్సు ఎన్నిసార్లు లేట్ గా వచ్చిందో వరకూ నా చుట్టూ జరిగిన విషయాలన్నీ చెప్పకపోతే మనసూరుకోదు.. మీ ప్రోజెక్ట్ ఏమో గానీ చూస్తుంటే రాధిక గారిని తెగ కష్టపెడుతున్నట్లున్నారు! కవితలు రాసేటప్పుడూ, ఆఫీసు ప్రోజెక్టులకూ ఇలా అన్ని విషయాలకీ సేవ చేసేసి మిమ్మల్ని బొత్తిగా పాడుచేసేస్తున్నారు!! ఇదేమాట ఉన్నది ఉన్నట్టుగా అక్షరాలు దాయకుండా ఆవిడకు చెప్పండి.. ఇంతకీ పిల్లలకి పల్లెటూరి ఆంటీ నచ్చిందో లేదో చెప్పనేలేదు!

ఇక ఇవాళ్టికి చాలని చేతి వేళ్ళు మొరాయిస్తున్నాయి.. మరి ప్రస్తుతానికి సెలవా..

**కార్తీక**



*** *** *** ***

*(తరువాతి భాగం వచ్చే సంచికలో..)*